
సాక్షి
కుమురం భీం

ఆదివారం । 19 । జనవరి । 2025



కారడవిలో కొండలరాయుని చరిత్ర

తర్లపాడ్, ఎక్బాల్‌పూర్, సింగాపూర్ గ్రామాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో కొండల రాయుని కోట శిథిలాలున్నాయి. దీని చరిత్ర వెలుగులోకి తేవాల్సిన అవసరముంది. 8లో▸



పోతురాజా మళ్లీ వస్తాం..

కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న పోతురాజు, ధర్మరాజు ఉత్సవాలు శనివారం ముగిశాయి. 'వెళ్లి వస్తాం స్వామి' అంటూ భక్తులు తిరుగుపయనమయ్యారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
28.0 /13.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలి కాస్త పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వెంకన్న సేవలో జిల్లా జడ్జి



ఆలయంలో జిల్లా జడ్జి రమేశ్ దంపతులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లోగల ప్రసిద్ధ బాలాజీ వేంకటేశ్వరస్వామిని శనివారం జిల్లా జడ్జీ రమేశ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు జడ్జికి స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకున్న జడ్జి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు జడ్జి దంపతులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేసులను సమన్వయంతో పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని అండర్ ట్రయల్ కేసులను సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ సూచించారు. శనివారం జిల్లాకేంద్రంలోగల కోర్టులోని తన కార్యాలయంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, సబ్ జైలర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి అండర్ ట్రయల్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి కక్షిదారుల పరిస్థితి అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. చార్జిషీట్ వేసిన, వేయని కేసులకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. బెయిల్ మంజూరైన వెంటనే నిర్ణీత నిబంధనలు పాటిస్తూ వారిని విడుదల చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు అండర్ ట్రయల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీసీ ఆర్బీ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం కౌటాల మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కౌటాల వార సంతలో ప్రజల సౌకర్యార్థం రూ. 3.5 లక్షల నిధులతో మూత్రశాలల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, నాయకులు ఉమా మహేశ్, తిరుపతి, రవీందర్‌గౌడ్, డబ్బా బాపు, ఖాశీం పాషా, గట్టయ్య, బండు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

తిర్యాణి: రైతు భరోసా, రేషన్‌కార్డు అర్హుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ సూచించారు. శనివారం మండలంలోని గిన్నెదరి గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఏఈవోలు వినోద్, శ్రవణ్ తదితరులున్నారు.

పిల్లలు బడిలోనే..

- జిల్లాలో బడిబయటి పిల్లల సర్వే
- ఇప్పటికే 108మంది గుర్తింపు
- 25తో ముగియనున్న ప్రక్రియ
- సంఖ్య మరింత పెరిగే అవకాశం



వాంకిడి: సామల గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ

కెరమెరి(ఆసిఫాబాద్): పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలన్నా సదుద్దేశంతో ఈ నెల 10నుంచి ప్రారంభించిన బడిబయటి పిల్లల సర్వే జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో సీఆర్పీలు సర్వే నిర్వహిస్తున్నారు. గతేడాది 648 మందిని గుర్తించి ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈసారి గతం కంటే ఎక్కువ సంఖ్యలో బడిబయటి పిల్లలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న సంఖ్య

తల్లిదండ్రుల నిర్లక్ష్యమో.. లేదా టీచర్ల పట్టింపు లేనితనమో తెలియదు గాని ఏటేటా బడిబయటి పిల్లల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలో 335 గ్రామ పంచాయతీల్లో 52మంది సీఆర్పీలు ఈ నెల 10 నుంచి సర్వే ప్రారంభించారు. సంక్రాంతి సెలవుల కారణంగా సర్వేలో కొంత జాప్యం జరిగింది. పాఠశాలలు మళ్లీ 18వ తేదీ నుంచి ప్రారంభం కావడంతో సర్వే ను సీఆర్పీలు వేగవంతం చేశారు. తొమ్మిది రోజులు గా జిల్లాలోని ఆవాస ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం వరకు జిల్లాలో 284 హ్యాబిటేషన్లలో 108 మంది బడిబయటి, బడి మానేసిన పిల్లలను గుర్తించారు. వీరిని ఇంకా ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేయలేదు. ఈ సర్వే ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనుంది.

ప్రత్యేక అవగాహన

బడిబయటి పిల్లల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలనే ఉద్దేశంతో డీఈవో, సెక్టోరల్ అధికారులు గత నెల 16న జూమ్ మీటింగ్ ద్వారా ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీసీవో, సీఆర్పీలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. రాష్ట్ర స్థాయి అధికారులు సర్వేలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో బడిబయటి పిల్లలు ఒక్కరూ మిగలకుండా, నిక్కచ్చిగా సర్వే నిర్వహించాలని సూచించారు.

సీఆర్పీలే కీలకం

బడిబయటి పిల్లలను గుర్తించడమే కాదు.. వారిని బడిలో చేర్పించాల్సిన బాధ్యత కూడా సీఆర్పీలపై ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సర్వేల్లో గుర్తించిన బడిబయటి పిల్లల్లో సుమారు 15 మందిని బడిలో చేర్పించినట్లు తెలుస్తోంది. వరుసగా 30 రోజులు హాజరు కాని విద్యార్థులను గుర్తించి తిరిగి బడికి హాజరయ్యేలా చేస్తున్నారు. గుర్తించిన పిల్లల్లో పాఠశాల వయస్సు వారిని తగిన తరగతిలో సమీప పాఠశాలలో లేదా యూఆర్‌ఎస్‌లో నమోదు చేసే అవకాశాన్ని కల్పించారు. గతేడాది జిల్లాలో 6–14 ఏళ్ల పిల్లలను బడిలో చేర్పించగా సెకండరీ ఎడ్యుకేషన్ విద్యార్థుల్లో కొందరికి ఓపెన్ స్కూల్, ఇంటర్‌లో ప్రవేశం కల్పించారు.

ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు

పొరుగునే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాల్లోని పిల్లలకూ చదువు నేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ సర్వేలో ఇటుక బట్టీలు, భవన నిర్మాణం, కులవృత్తులు తదితర రంగాల్లో తల్లిదండ్రులతో కలిసి పని చేసేవారినీ గుర్తించనున్నారు. 6–14 ఏళ్లవారు ఒకేచోట 10 మంది పిల్లలుంటే తాత్కాలికంగా సమీపంలో నాన్ రెసిడెన్సియల్ (ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ) స్కూల్ ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక విద్యావలంటీర్లను నియమించి మూడు నుంచి ఆరు నెలల పాటు ఆయా రాష్ట్రాల భాషతోపాటు తెలుగు నేర్పించేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఆ తర్వాత పిల్లలను కేజీబీవీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేర్పిస్తారు. 15 నుంచి 19 ఏళ్ల గలవారిని ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో చేర్పించడంతో పాటు పీజురీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	730
కాంప్లెక్స్‌లు	67
సీఆర్పీలు	52
బడిబయటి పిల్లలు	108
సర్వే కొనసాగిన హ్యాబిటేషన్లు	284

పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి



జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో బడిబయటి పిల్లలను గుర్తించేందుకు సర్వే కొనసాగుతోంది. గుర్తించిన పిల్లలను ప్రబంద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు. గతేడాది కంటే ఎక్కువమంది పిల్లలను గుర్తించాలి.
– శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

రవాణా భత్యం చెల్లించాలి



జిల్లాలో ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలు సర్వేలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం రవాణా భత్యం ఇవ్వాలి. ప్రతీరోజు పాఠశాలల పర్యవేక్షణ కోసం వెళ్లాల్సి ఉంటుంది. పెరుగుతున్న నిత్యావసరాల ధరల నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న వేతనం సరిపోక ఇబ్బంది పడుతున్నాం.
– పవన్‌కుమార్, సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు

అర్హులకే సంక్షేమ పథకాలు



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ సమీపంలో రైతు భరోసా పథకంపై నిర్వహిస్తున్న వ్యవసాయ భూముల సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి యోగ్యమయ్యే భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు. పట్టణంలో పలుచోట్ల కూరగాయలు విక్రయిస్తుండటంతో జూబ్లీ మార్కెట్‌లో వ్యాపారాలు సాగడం లేదని పలువురు వ్యాపారులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో సంబంధిత అధికారులతో చర్చించి, సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం జన్కాపూర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, వ్యవసాయాధికారి మిలింద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే అందాలి

కెరమెరి(ఆసిఫాబాద్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్, ఎస్‌బీఎం కాంప్లెక్స్ మరుగుదొడ్ల మార్కింగ్, సాకడ గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డుల క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్‌బీఎం కాంప్లెక్స్ టాయిలెట్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. అనంతరం గోయగాం ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎండీఎం, వంటగదులు, భోజన నాణ్యత, రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు బోధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అమ్జద్‌పాషా తదితరులున్నారు.

అర్హులకే కొత్త కార్డులు



జిల్లా కేంద్రంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

- జిల్లాలో కొనసాగుతున్న సర్వే
- లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- 26 నుంచి కార్డుల జారీ షురూ

ఆసిఫాబాద్: ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించింది. సమగ్ర కులగణన సర్వే ప్రాతిపదికన ఈ నెల 16నుంచి అర్హుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైంది. సంబంధిత అధికారులు గడపగడపకూ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. తాజాగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దీంతో పాటు గ్రామసభల్లో కొత్తవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పాత కార్డుల తొలగింపు ఉండదని, కొత్తవారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో చాలామంది అర్హులు రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. సర్వే అనంతరం ఈప్రక్రియ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటికే కార్డులున్నవారి కుటుంబాల్లో కొంత మంది పేర్లు లేవు. దీంతో వారు తమ పేర్లు నమోదు చేయాలని కోరుతున్నారు. వీరితో పాటు కుటుంబంలో చిన్నపిల్లలు, పెళ్లయిన కొత్త కోడళ్ల పేర్లు నమోదుకు దరఖాస్తు చేసుకుని నిరీక్షిస్తున్నారు.

ఇప్పటికే 1,39,734 కార్డులు

జిల్లాలో 1,39,734 రేషన్ కార్డులున్నాయి. జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో 314 రేషన్ దుకాణాలున్నాయి. వీటిలో 13,192 అంత్యోదయ, 1,26,542 ఫుడ్ సెక్యూరిటీ కార్డులున్నాయి. ప్రతీనెల 2,949.746 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మార్చి నుంచి సన్నబియ్యం పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు.

17,044 దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 1,63,647 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్త రేషన్ కార్డుల కోసం 17,044 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో దరఖాస్తుదారులు ఏడాదిగా కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన సర్వే 19 వరకు కొనసాగనుంది. ఈ నెల 20 నుంచి 24వరకు గ్రామసభల్లో అర్హుల జాబితా చదివి వినిపించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం ఈ నెల 26న తుది జాబితా సిద్ధం చేస్తారు. తుది జాబితా ఆధారంగా కొత్త కార్డులు జారీ చేస్తారు.

ఇవే నిబంధనలు..

కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతంలో వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల మించి ఉండకూడదు. 3.5 ఎకరాల మాగాణి, 7.5 ఎకరాల మెట్ట మించకుండా ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వైద్యులు, కాంట్రాక్టర్లు, నాలుగుచక్రాల వాహనదారులను అనర్హులుగా పరిగణిస్తారు. కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు నంబర్లతో మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పేరు లేకుంటే ఆందోళన వద్దు



వీసీలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

ఆసిఫాబాద్: రేషన్ కార్డుల అర్హుల జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర మంత్రులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. కుల సామాజిక, ఆర్థిక సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే వరకూ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ కొనసాగుతోంది

జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై సర్వే కొనసాగుతోంది. ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ నెల 26 నుంచి కొత్త కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అర్హులందరికీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తుంది.
– వినోద్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష



ఆసిఫాబాద్‌రూరల్: కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో నిర్వహించిన జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయాల్లో ఆరోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష ఉదయం 11.30 గంటలకు ఉండగా విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. 10.30 గంటలకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లాలో ఆరు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లో రెండు, కాగజ్ నగర్‌లో రెండు, సిర్పూర్ (టీ) సెంటర్‌లో 1,159 మంది విద్యార్థులకు 805 మంది హాజరు కాగా, 354 మంది గైర్హాజరైనట్లు నవోదయ ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ప్రిన్సిపాల్ పార్వతి పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 సెంటర్లలో 5,191 మందికిగాను 4,167 మంది హాజరు కాగా 1,024 మంది గైర్హాజరయ్యారు.

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని నవోదయ విద్యాలయం, సెయింట్ క్లారిటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను కాగజ్‌నగర్ నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 156 మందికి 105 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 162 మందికి 141 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 25వ నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బండారు రవికుమార్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ ప్రభుత్వంతో పోరాడుతోందని తెలిపారు. జిల్లాలో పోడు రైతుల పక్షాన పోరాడి పట్టాలు ఇప్పించినట్లు పేర్కొన్నారు. పులి పేరిట తునికాకు సేకరణ చేయొద్దని జిల్లా అటవీ శాఖ అధికారులు సంబంధిత రాష్ట్ర అధికారులకు తెలియజేసిన వెంటనే సమస్య పరిష్కారంలో ముందు నిలిచిందని తెలిపారు. జిల్లాలో ఎక్కడ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసిన ఘనత సీపీఎంకే దక్కుతుందని పేర్కొన్నారు. పార్టీ మహాసభలకు పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, కార్యవర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్, రాజేందర్, టీకానంద్, మాలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బొక్కివాగు ప్రాజెక్ట్ వద్ద బర్డ్ వాక్



పెంచికల్‌పేట్: ఫొటోలు తీస్తున్న పక్షి ప్రేమికులు



సిర్పూర్(టి): చింతకుంట సెక్షన్ పరిధిలో..

పెంచికల్‌పేట్: అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పక్షుల అధ్యయనానికి బర్డ్ వాక్ కార్యక్రమాన్ని ఎల్లూర్ బొక్కివాగు ప్రాజెక్ట్ వద్ద కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఎఫ్‌డీవో సుశాంత్ సుఖదేర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 14 మంది ఔత్సాహికులు క్షేత్ర పర్యటనకు వచ్చారు. రేంజ్ పరిధిలోని చెరువులు, కుంటలు, పెద్దవాగు, ప్రాణహిత పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి, పక్షులను బంధిస్తూ ముందుకు సాగారు. పాలరాపు గుట్ట వద్ద గల రాబందుల స్థావరాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సఫారీల్లో అటవీ ప్రాంతాల్లో పర్యటిస్తూ పక్షులను కెమెరాల్లో బంధించారు. పెంచికల్‌పేట్ ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్, ఎఫ్‌ఎస్వో జగన్, జమీల్, ఆస్మా, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి): అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం సిర్పూర్(టి) అటవీశాఖ రేంజ్ పరిధిలో మొదటి రోజు బర్డ్‌వాక్ నిర్వహించారు. మూడో బర్డ్‌వాక్ ఫెస్టివల్‌లో భాగంగా అటవీశాఖ అధికారులు, జంతు ప్రేమికులు, పర్యాటకులు దేశీ, విదేశీ పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చింతకుంట సెక్షన్ పరిధిలోని నీటి కుంటలు, హీరాపూర్ వాగు, జీడి వాగు ప్రాంతాల్లో పర్యటించి పక్షుల ఫొటోలు తీశారు. ఎఫ్‌డీవో సుశాంత్ బొబడే, ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్, సెక్షన్ అధికారులు మోహన్‌రావ్, ప్రసాద్‌రావ్, బీట్ అధికారి మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

చప్రాడాకు మహాపాదయాత్ర



ఆలయ ఆవరణలో పాదయాత్రను ప్రారంభిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

బెజ్జూర్: మండలంలోని ఎల్కపల్లి(బీ) అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మహా రాష్ట్రలోని చప్రాడాలోగల దత్తవార్ కార్తీకస్వామి మహరాజ్ ఆలయం వరకు 20వ మహా పాదయాత్ర కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. బెజ్జూర్, కుకుడ, బారెగూడ, రుద్రపూర్, చింతలమానెపల్లి, అనుకోడ, రవీంద్రనగర్, తుమ్మిహేటి గ్రామాల మీదుగా సాగిన పాదయాత్రలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నా రు. భక్తులకు కేశెట్టి శ్రీనివాస్, సామల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ సుల్తానా జావీద్ అల్పాహారం అందజేశారు. చప్రాడా ఆలయంలో భక్తులకు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుధాకర్‌రావు, ఎల్కపల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, కంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య, రంగనాయక ఆలయ కమిటీ చైర్మన్ తంగిడెపల్లి మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, నిర్వాహకులు భాస్కర్ రాజు, పుల్లూరి సతీశ్, సామల తిరుపతి, దిగంబర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల రిఫరీ బోర్డు చైర్మన్‌గా నారాయణరెడ్డి



నారాయణరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ నెల 17నుంచి 21వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా నారఖేడ్‌లో నిర్వహించనున్న 69వ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ రిఫరీ బోర్డు చైర్మన్‌గా మండలంలోని గోలేటికి చెందిన ఆర్.నారాయణరెడ్డి వ్యవహరించనున్నట్లు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, సెపక్ తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు భాస్కర్, రామకృష్ణ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన రశ్మితతో హెచ్ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఖేలో ఇండియా అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హాజీపూర్ మండలం దొనబండ జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.రశ్మిత ఎంపికైంది. గత నెల 21న మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రశ్మిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయని, వీటికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ట్రైకార్ ద్వారా చెక్కులను శనివారం సంఘాల సభ్యులకు అందజేశారు. ట్రైకార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బెన మండలాల రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీపై ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల చెక్కులను సభ్యులకు అందించారు. ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞశీల్, బోర్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కారడవిలో.. కొండలరాయుని చరిత్ర

- దట్టమైన అడవిలో నిట్టనిలువుగా కొండ
- చుట్టూ రాతి కంచె..
- వెలుగులోకి తెచ్చిన చరిత్రకారుల బృందం
- ఆర్కియాలజీ, పురావస్తు శాఖలు చొరవ చూపితే పర్యాటక శోభ



కొండల రాయుని గుట్టను చూపుతున్న కరిపె రాజ్‌కుమార్

ఖానాపూర్: దట్టమైన అడవులకు నిలయంగా ఉన్న ఖానాపూర్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ కోటను కాపాడి చరిత్రను వెలుగులోకి తెచ్చే వారు లేరు. దీంతో చరిత్ర మరుగున పడే అవకాశం ఉంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడ్, ఎక్బాల్‌పూర్, సింగాపూర్ గ్రామాల మధ్యలోని దట్టమైన అటవీప్రాంతంలో నిట్టనిలువుగా ఉన్న ఒక పెద్ద గుట్టపైన కొండల రాయుని కోట శిథిలాలు ఉన్నాయి. గుట్ట కింది భాగం నుంచి శిఖరాగ్రం వరకు సుమారు కిలోమీటరు పైనే ఉంటుందని చరిత్రకారులు బృందం సభ్యులు కరిపె రాజ్‌కుమార్, కరిపె రాజశేఖర్, గోండు మధు, చాకలి హన్మంతు తెలిపారు. ఇటీవల అత్యంత శ్రమకోర్చి శిథిల రాతి కంచెను గుర్తించారు. సుమారు పదెకరాల విస్తీర్ణంలో కొండ వ్యాపించి ఉంది. కోటకు మొదట్లో ద్వారపు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దారి వెంబడి పైకి వెళ్తున్న కొద్దీ పెద్ద పెద్ద బేటురాళ్లు అక్కడక్కడ దర్శనమిస్తాయి. ఎత్తైన ప్రదేశాల్లో అంతస్తుల తరహాలో రాళ్లతో పటిష్టంగా నిర్మించిన బురుజులు ఉన్నాయి. ప్రతీ వందమీటర్ల ఎత్తుకు వెళ్లే కొద్దీ ఒక్కో దిక్కులో అనేక బురుజులు కనిపిస్తాయి.

సమాధిలాంటి రాతి నిర్మాణాలు

శిఖరాగ్రంలోని ఆగ్నేయ దిక్కులో ఒక పెద్ద సమాధి లాంటి రాతి నిర్మాణం సుమారు 20 అడుగుల ఎత్తులో నిర్మించి ఉంది. ఈ రాతి నిర్మాణం శిథిలమైనప్పటికీ దీనినే కొండల రాయుడి సమాధిగా చరిత్రకారులు భావిస్తున్నారు. దిగువన పడమటి దిక్కున సైతం కొంచెం చిన్నదిగా అలాంటి మరో నిర్మాణం ఉంది. దీన్ని రాణి సమాధిగా ప్రజలు భావిస్తున్నారు. చుట్టూ కొలత దాదాపు 8 కిలోమీటర్లకు పైగా ఉంది. రాతి కంచె ఎక్కడా కూడా శిథిలం కాలేదు. ఈ మార్గం వెంబడి లోహ పరిశ్రమకు చెందిన ఇనుప చిట్టెంలు, కాల్చిన ఇటుకలు కూడా గుర్తించారు.



గుట్టపై లభించిన కాల్చిన ఇటుక



గుట్టపై లభించిన ఇనుప చిట్టెంలు

ఆర్కియాలజీ, పురావస్తు శాఖ చొరవ చూపాలి

బలుమూరి కొండయ్య 1690–1720 నిజామాబాద్ జిల్లాలోని భీమ్‌గల్ జాగీరు కోసం గోల్కొండ పాలకులతో యుద్ధానికి దిగినట్లు చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. అపజయాన్ని శంకించి భీమ్‌గల్‌లోని పల్లికొండ దగ్గర బాచనపల్లి చిన్నోల్ల గుట్ట మీద ఆత్మహుతి చేసుకున్న కొండల రాయుడి దేహాన్ని ఆయన అనుచరులు కామారెడ్డి దగ్గరలోని వెల్లుల్లపేటలో సమాధి చేశారని మరో కథ ప్రచారంలో ఉంది. వీటన్నింటినీ మరిన్ని వివరాలతో వెలుగులోకి వచ్చేలా పురావస్తు, ఆర్కియాలజీ శాఖలు చొరవ చూపితే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

కాకులు దూరని కారడవి..

కాకులు దూరని కారడవిలా ఉన్న ఈ ప్రాంతంలో బహుశా కత్తుల తయారీ జరిగి ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కొండల రాయుడు గుర్రంపైన చాలా వేగంగా ప్రయాణించేవాడని, ఈ ప్రాంత ప్రజలందరికీ ఆరాధ్యుడనే విషయం బొబ్బిలి కథకుల ద్వారా తెలుస్తోంది. కొడుకా..కొండల రాయుడా.. అనే మకుటంతో ఒక స్మృతి గీతం అప్పుడప్పుడు ప్రజల నోళ్లలో ఇప్పటికీ నానుతూనే ఉంది.

చరిత్ర వెలుగులోకి తేవాలి

కొండల రాయుని గురించి ప్రజలు పాడుకున్న జానపద గీతం, బిరుదు తదితర సమాచారం, చరిత్ర పుటల్లోంచి నేటి సమాజానికి తెలిసి వచ్చేలా పురావస్తు శాఖ, ఆర్కియాలజీ శాఖలు, ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రముఖ చరిత్ర పరిశోధన బృందంతో కలిసి సమష్టిగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది. తద్వారా భవిష్యత్ తరాలకు గత చరిత్రలు తెలియవస్తాయి.

– కరిపె రాజ్‌కుమార్, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు

ఉదారత చాటిన తోటి కానిస్టేబుళ్లు

- మృతుడి కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: తోటి కానిస్టేబుల్ మృతిచెందడంతో కానిస్టేబుళ్లు ఉదారత చాటారు. తమవంతుగా ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకొచ్చారు. 2004 ఏఆర్ బ్యాచ్‌కు చెందిన పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అఖ్తర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబీకులకు ఉమ్మడి జిల్లా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు శనివారం రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి భార్య, పిల్లలకు రూ.1.50 లక్షలు, అఖ్తర్ తల్లిదండ్రులకు రూ.50 వేల నగదు అందించారు. ఆర్ఐ డి.వెంకట్, కానిస్టేబుళ్లు కిశోర్, ప్రవీణ్, అజయ్, రాందాస్, ప్రకాశ్, విజయ్, రాజేశ్వర్, ధనరాజ్, సతీశ్, కైలాస్ పాల్గొన్నారు.

హాజీపూర్‌లో అటవీ ప్రాంతాల సందర్శన



గఢ్‌పూర్ అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలను ప్రకృతి ప్రేమికులు శనివారం సందర్శించారు. చిన్నగోపాల్‌పూర్, గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీ జంతువులను వీక్షించారు. స్వీడన్, లండన్ నుంచి విచ్చేసిన సంగీత కళాకారులతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. జైనథ్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మండలంలోని రామాయి గ్రామానికి చెందిన టాప్రే అనిల్ (39) చేపల వేట కోసం శుక్రవారం సాయంత్రం పార్డి(కె), రామాయి గ్రామాల సమీపంలోని సాత్నాల వాగు వద్దకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని పార్డి(కె) సమీపంలోని వాగులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆయన కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం వాగులో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సింగరేణి కుట్రలను తిప్పికొట్టిన ఎస్టీపీపీ కార్మికులు

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్
- టోకెన్ సమ్మె విజయవంతం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, హెచ్ఎంఎస్ నాయకులు

జైపూర్: సింగరేణి అధికారుల కుట్రలను తిప్పకొడుతూ ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి టోకెన్ సమ్మెను విజయవంతం చేశారని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. జైపూర్ ఎస్టీపీపీ భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ఎన్టీపీసీలో చెల్లిస్తున్న మాదిరిగా వేతనాలతోపాటు డస్టు, రిస్క్, నైట్ డ్యూటీ అలవెన్సులు రూ.5 వేలు చెల్లించడంతోపాటు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టారు. సుమారు వెయ్యిమందికి పైగా కార్మికులు పాల్గొని ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడారు. 2009 భూసేకరణ సమయంలో అధికారులు భూ నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధి కల్పించి ఏళ్లు గడుస్తోందన్నారు. ప్రతి నాలుగేళ్లకోసారి పదోన్నతి కల్పిస్తూ సెమిస్కిల్డ్, స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో కాకుండా సీఎస్ఆర్ నిధులను మంత్రుల ఇళ్లల్లో సామగ్రికి, ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేస్తోందన్నారు. కార్మిక సమస్యలపై హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో 22 సార్లు చర్చల్లో పాల్గొన్న యాజమాన్యం పట్టించుకోకపోవడంతో సమ్మె చేపట్టినట్లు తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కాగా, రాత్రి వరకు కార్మికులు నిరసన వ్యక్తం చేయగా, ఎలాంటి గొడవలు జరగకుండా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై శ్రీధర్, సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

'సమ్మె ప్రభావం లేదు'

ఎస్టీపీపీలో టోకెన్ సమ్మె ప్రభావం లేదని ఈడీ రాజశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, ఫ్లైయాష్, బాటమ్ యాష్ సరఫరా యథావిధిగానే జరిగిందని పేర్కొన్నారు. సీఎండీ బలరాం చొరవతో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా కింద గత సంవత్సరం రూ.5 వేలు చెల్లించామని తెలిపారు.

ఉరేసుకుని రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్య



భీమరాజు (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కడమంచి భీమరాజు (70) శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..భీమరాజు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తన భార్య కొన్నాళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అటు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మానసికంగా కలత చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఆపస్మారక స్థితిలో పడిపోగా గమనించిన సిబ్బంది
- బైక్‌పై ఆసుపత్రికి తరలింపు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీకి చెందిన సెండె సంతోష్ శనివారం పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆపస్మారక స్థితిలో దారిలో పడిపోయాడు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ షేక్ ఖాదర్, అటెండర్ మల్లేశ్‌లు ఇటిక్యాల పహాడ్ గ్రామంలో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వెళ్లివస్తుండగా మార్గమధ్యలో సంతోష్‌ను గమనించారు. బైక్‌పై సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

నాటుసారా స్థావరంపై దాడులు



బెల్లం పానకం స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 40 లీటర్ల నాటుసారా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ చేస్తున్న వారిని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు లోబానంద్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పటిక, బెల్లం పట్టివేత

దండేపల్లి: లక్సెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండలం లింగాపూర్, మేదరిపేటలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో ప టిక, బెల్లంతోపాటు గుడుంబా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. లింగాపూర్‌లో బోడ పంచిబాయి వద్ద 2 లీటర్ల గుడుంబా, మేదరిపేటలోని గోలి రమేశ్ కిరాణా షాపులో 95 కిలోల బెల్లం, 10 కిలోల పటికను ప ట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడికి పాల్పడిన ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్‌లో ఈనెల 15న బీజేపీ నాయకుడు మిట్టపల్లి జయరామారావుపై దాడికి పాల్పడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చేపల మార్కెట్‌లో జయరామారావు చేపలు కొనుగోలు చేస్తుండగా అకారణంగా సంజీవ్, సాయితేజలు అతనిపై దాడి చేశారు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రాజవర్ధన్

జన్నారం: బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. జన్నారం పోలీసుస్టేషన్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం సమీపంలో పోలీసులు శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వస్తున్న ముహ్మదబాద్‌కు చెందిన కామెర నగేశ్, బెంబడి పవన్‌ను తనిఖీ చేయగా వారి వద్ద 30 గ్రాముల గంజాయి లభించింది. ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరు రిమాండ్

కాగజ్‌నగర్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఈజ్‌గాం ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబరు 12 గ్రామానికి చెందిన యువకుడు ఉజ్వల్ భక్షి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద లభ్యమైన 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తాంసి: భీంపూర్ మండలం గుబిడి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నలందప్రియ తెలిపారు. గుబిడి శివారులోని పెన్‌గంగ నది వెంట శనివారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. పెన్‌గంగ నది ఒడ్డున పంట చేలలో పక్కన అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. 11 చోట్ల నిల్వ చేసిన డంప్‌ల్లో 25 ట్రాక్టర్ల మేర నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ రాందాస్, సిబ్బంది ఉన్నారు.

దైవ దర్శనానికి వచ్చి..కానరాని లోకాలకు

- ఇందాపూర్ వాగు దాటుతుండగా నీట మునిగిన వ్యక్తి
- మృతుడు మహారాష్ట్ర వాసి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): దైవదర్శనానికి వచ్చి ఒకరు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని ఇందాపూర్ వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఇందాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు (30) ఈనెల 16న ఇందాపూర్ సమీపంలో పోతురాజు, ధర్మరాజు జాతరకు వచ్చాడు. 17 వరకు ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో తండ్రి దౌలత్‌రావు బంధువుల వద్ద వాకబు చేయగా కుమారుడు ఆచూకీ దొరకలేదు. అదేరోజు కెరమెరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఇందాపూర్ వాగులో మృతదేహం కనిపించినట్లు పలువురు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు కోట్నాక మారుదని గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో కంప్యూటర్ల చోరీ

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సీఐ సైదారావు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మూడు కంప్యూటర్లు చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చొరబడి కంప్యూటర్ ల్యాబ్ తాళం పగులగొట్టారు. రూ.54 వేల విలువ గల మూడు కంప్యూటర్లకు సంబంధించిన సీపీయూలు, మానిటర్లు, యూపీఎస్‌లు, కీబోర్డు, మౌస్‌లు ఎత్తుకెళ్లారని హెచ్ఎం నరేందర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. చోరీ ఘటన విషయం తెలియడంతో సీఐ సైదారావు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అంతకుముందు క్లూస్‌టీం సిబ్బందితో విచారణ చేపట్టారు.

గంగాజలంతో ఉట్నూర్‌కు మెస్రం వంశీయులు



ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్‌రూరల్: కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతరకు మెస్రం వంశీయులు కాలినడకన జన్నారం మండలం కలమడుగు గోదావరి నదికి చేరుకున్నారు. గంగాజలం తీసుకుని తిరుగుపయనంలో శనివారం ఉట్నూర్‌లోని గోండుగూడకు చేరుకున్నారు. మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, యువ నాయకుడు జయచంద్ర స్వాగతం పలికారు. వారు కొంతసేపు సేద తీరారు. రాత్రి ఉట్నూర్‌లో బస చేసి ఆదివారం ఉదయం ఇంద్రవెల్లికి బయల్దేరనున్నారు. ఆలయ చైర్మన్ కోసేరావు పటేల్ ఉన్నారు.

గాయపడిన యువకుడు మృతి



రాజేందర్(ఫైల్)

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్(26) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్, దుర్గం శంకర్ సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులో రైతు నవీన్ మామిడితోటలో పని చేస్తున్నారు. ఈ నెల 14న వేకువజామున రాజేందర్, శంకర్ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. భగవంత్‌రావునగర్‌లో గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు వీరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ రాజేందర్ మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా, శంకర్ కోలుకున్నాడు.